నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
05-08-2025
పేజీలు: 02



ఆపరేషన్ సింధూర్ సక్సెస్.. ప్రధాని మోదీని
## సన్మానించిన ఎన్డీఏ ఎంపీలు

పార్లమెంట్‌లో ఇవాళ ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీని సత్కరించారు. ఆపరేషన్ సింధూర్‌తో విజయం సాధించినందుకు.. ప్రధాని మోదీని సన్మానించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ .. ప్రధాని మెడలో పూలమాల వేశారు. హర హర మహాదేవ్ అంటూ ఎన్డీఏ ఎంపీలు నినాదాలు చేశారు. ఆపరేషన్ సింధూర్, ఆపరేషన్ మహాదేవ్ తర్వాత తొలిసారి ఎన్డీఏ కూటమి ఎంపీలు భేటీ అయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తీరు, ప్రతిపక్షాలు వ్యవహారశైలిపై కూడా ఆ భేటీలో చర్చించారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత.. భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను ఆ ఆపరేషన్ ద్వారా పేల్చేశారు. వందల సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చారు. ఆ తర్వాత పెహల్గామ్ ఉగ్రదాడికి ప్లాన్ వేసిన సూత్రధారుల్ని ఆపరేషన్ మహాదేవ్‌లో భాగంగా హతమార్చిన విషయం తెలిసిందే.




## ఈడీ ముందు విచారణకు హాజరైన అనిల్ అంబానీ

ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ ఈడీ విచారణకు హాజరయ్యారు. రూ.17 వేల కోట్ల విలువైన రుణ మోసానికి సంబంధించిన కేసులో 5న విచారణకు రావాలంటూ ఈ నెల 1న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చోటా అంబానీకి సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం న్యూఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో ఈడీ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది. గత వారం రిలయన్స్ గ్రూప్‌తో సంబంధం ఉన్న 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబైలోని దాదాపు 35 చోట్ల ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దాఖలు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారం గా ఈడీ ఈ చర్యలు చేపట్టింది.కాగా, బ్యాంకులకు రుణాల ఎగవేత కేసుల్లో అనిల్ అంబానీకి ఈడీ ఉచ్చు బిగుస్తోంది. రూ.3 వేల కోట్ల రుణ మోసం కేసులో లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా అనిల్ అంబానీ కంపెనీలకు రుణాలు ఇచ్చిన బ్యాంకులకు ఈడీ లేఖ రాసింది. రిలయన్స్ హౌసింగ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌కు రుణాలు ఇచ్చిన 12-13 ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు ఈడీ తాజాగా లేఖలు రాసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యూకో, పంజాబ్, సింద్ బ్యాంక్‌ల నుంచి రుణాల ఎగవేతకు సంబంధించిన వివరాలను తమకు ఇవ్వాలని కోరినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు ఈ రుణాలకు సంబంధించి కొంత మంది బ్యాంకు అధికారులను కూడా ఈడీ పశ్నించే అవకాశం ఉందని తెలిసింది.

Tesla భారత్‌లో రెండో షోరూమ్
# ప్రారంభానికి సిద్ధం!

ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్‌లో వేగంగా విస్తరిస్తోంది. ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభించిన తరువాత చాలా త్వరగా, ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలో రెండో షోరూమ్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు పూర్తి చేస్తున్నది. ఈ కొత్త 'టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్' ఆగస్టు 11న ఢిల్లీలోని ఏరోసిటీలోని ఖరీదైన వరల్డ్‌మార్క్ 3 కాంప్లెక్స్‌లో ప్రారంభం కానుంది.షోరూమ్ ఏర్పాటు పనులు ప్రస్తుతానికి పూర్తికి దగ్గరయ్యాయి. దీనికి సంబంధించిన ఫొటోలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. జాతీయ రాజధానిలోని వినియోగదారులను ఆకర్షించేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ షోరూమ్‌కు నెలకు సుమారు రూ. 25 లక్షల అద్దె ఖర్చు జరుగుతుందని సమాచారం.గత నెల జూలై 15న టెస్లా మొదటి భారతీయ షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హాజరై, రాష్ట్రంలో ఆర్ అండ్ డీ కేంద్రం మరియు తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని టెస్లాను ఆహ్వానించారు. ప్రస్తుతం టెస్లా భారత మార్కెట్‌లో 'మోడల్ వై' పేరుతో ఒక్కటే మోడల్ విక్రయిస్తోంది. దీని ఎక్స్-షోరూమ్ ధర రూ. 59.89 లక్షల నుండి ప్రారంభమవుతుంది. ఈ కారు రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. స్టాండర్డ్ రియర్-వీల్ డ్రైవ్ వేరియంట్ 60 kWh బ్యాటరీతో ఒకసారి ఛార్జ్ చేసినప్పుడు సుమారు 500




కిలోమీటర్ల ప్రయాణం చేయగలదు. అలాగే, లాంగ్-రేంజ్ వేరియంట్ 75 kWh బ్యాటరీతో 622 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.తొలి దశలో ముంబై, పుణే, ఢిల్లీ, గురుగ్రామ్ నగరాల కొనుగోలుదారులకు ప్రాధాన్యతనిస్తూ వాహనాలను డెలివరీ చేయనున్నారు. ఫ్లాట్-బెడ్ ట్రక్కుల ద్వారా కస్టమర్ల ఇంటికి నేరుగా వాహనాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించగా, వినియోగదారుల సౌలభ్యం కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వాహన రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని అందించేందుకు టెస్లా తన అధికారిక వెబ్‌సైట్‌ను నవీకరించింది. అదనంగా, రూ. 6 లక్షలతో లభించే 'ఫుల్ సెల్ఫ్-డ్రైవింగ్' ఫీచర్ భవిష్యత్తులో భారత్‌లో అందుబాటులోకి తీసుకురావడానికి కంపెనీ పనులు జరుపుతోంది.గత నెల జూలై 15న ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో టెస్లా తొలి షోరూమ్ తెరచిన విషయం తెలిసిందే.

మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌కు మంచి స్పందన లభించింది. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఈ ప్రారంభోత్స వానికి హాజరై, పరిశ్రమల పెరుగుదలకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం భారత మార్కెట్‌లో టెస్లా ఒక్క మోడల్ మాత్రమే విక్రయిస్తోంది. అదే 'మోడల్ వై'. దీని ధర రూ. 59.89 లక్షల నుంచి మొదలవు తోంది. 2 వేరియంట్లలో లభ్యమవు తోంది.ఒకటి స్టాండర్డ్ రియర్-వీల్ డ్రైవ్, మరొకటి లాంగ్-రేంజ్.స్టాండర్డ్ వేరియంట్ 60kWh బ్యాటరీతో 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. లాంగ్-రేంజ్ వేరియంట్ 75kWh బ్యాటరీతో 622 కిలోమీటర్ల వరకు వెళ్లగలదు. భారత రోడ్లకు తగినంత రేంజ్ ఉండటం వినియోగదారులకు ఆకర్షణగా మారుతోంది.మొదటి దశలో టెస్లా ముంబై, పుణె, ఢిల్లీ, గురుగ్రామ్‌లోనే డెలివరీలు అందిస్తుంది. కార్లను నేరుగా వినియోగదారుల ఇంటికే ఫ్లాట్‌బెడ్ ట్రక్కుల ద్వారా పంపనుంది.



## కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోము

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోమని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెట్టిన తర్వాతే స్పందిస్తామని, కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానిదా..కాంగ్రెస్‌దా అని చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బిజెపి చెబుతుందన్నారు. సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, బిసి జాబితాలో ముస్లింలను కలపొద్దని కాంగ్రెస్ ను కోరారు. కాంగ్రెస్ కు బిసిలపై ప్రేమ ఉంటే మహేశ్వర్ గౌడ్ ముఖ్యమంత్రిని చేయాలని రాంచందర్ రావు పలుమార్లు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

ఇకపై ట్రాన్స్‌జెండర్ మహిళలకు
## స్పోర్ట్స్ వీసాలపై నిషేధం.. ట్రంప్ సర్కార్ నిర్ణయం!

వివాదాస్పద నిర్ణయాలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. అమెరికా ఫస్ట్ అంటూ విదేశీ విద్యార్థులపై ఆంక్షలు, అక్రమ వలసదారులకు బేడీలు వేసి బలవంతంగా వారి స్వదేశాలకు పంపించడం, ప్రపంచ దేశాలపై ఎడాపెడా ప్రతీకార సుంకాలు, గ్రీన్ కార్డులు, వీసాలపై కోతలు విధిస్తూ తనదైన శైలిలో పాలనను కొనసాగిస్తున్నారు. తాజాగా ట్రాన్స్ జెండర్ మహిళలకు స్పోర్ట్స్ వీసాలపై పరిమితులు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మహిళల క్రీడల్లో పోటీ పడాలనుకునే లింగమార్పిడి మహిళలకు మీసా అర్హతను పరిమితం చేస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు అమెరికన్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ పాలసీని సవరించింది. దీని ప్రకారం పురుషుడిగా జన్మించి లింగమార్పిడి చేసుకుని మహిళల క్రీడల్లో పోటీ పడే క్రీడాకారుల దరఖాస్తులను ప్రతికూలంగా పరిగణించనుంది. మహిళల క్రీడల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడాన్ని నిషేధించే కార్యనిర్వాహక ఉత్తర్వులపై ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ట్రంప్ సంతకం చేశారు. మహిళల క్రీడలపై జరుగుతున్న యుద్ధం ఈ ఆదేశాలతో ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. మహిళా అథ్లెట్ల సంప్రదాయాన్ని మేం రక్షిస్తాం. వారి క్రీడల్లోకి పురుషులు ప్రవేశించి, వారిని కొట్టడాన్ని అడ్డుకుంటాం. ఇక



నుంచి స్త్రీల క్రీడలు స్త్రీలకు మాత్రమే అని స్పష్టం చేశారు. అయితే ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయానికి సెనెట్‌లో చెక్కెదురైంది. మార్చి 5న సెనెట్‌లో జరిగిన ఓటింగ్‌లో వ్యతిరేకంగా 45 ఓట్లు రావాల్సి ఉంది. బిల్లుకు మద్దతుగా 60 ఓట్లు రావాల్సి ఉండగా 51 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఈ నేపథ్యంలో యూఎస్‌సీఐఎస్‌లో ట్రంప్ ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది.




## ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు సిరాజ్

మొహమ్మద్ సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఓవల్ టెస్టులో అతను మొత్తం 9 వికెట్లు తీసుకున్నాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీశాడతను. మ్యాచ్ గెలవడం సంతోషంగా ఉందన్నాడు. తొలి రోజు నుంచి అయిదో రోజు వరకు తీవ్రంగా పోరాడినట్లు చెప్పాడు. లైన్‌లో బౌలింగ్ చేసి, వత్తిడి పెంచాలన్న ఉద్దేశంతోనే బౌలింగ్ చేసినట్లు చెప్పాడు. ఇవాళ ఉదయం నిద్ర లేవగానే, ఆ పని చేయగలనన్న ఉద్దేశంతో మైదానంలోకి అడుగు పెట్టినట్లు తెలిపాడు. బిలీవ్.. నమ్మకం అన్న పిక్‌ను గూగుల్ నుంచి ఇవాళ ఉదయం డౌనలోడ్ చేసుకున్నట్లు సిరాజ్ వెల్లడించాడు. వాస్తవానికి బ్రూక్ క్యాచ్‌ను జారవిరచడం పెద్ద పొరపాటే అన్నాడు. ఒకవేళ ఆ క్యాచ్‌ను పట్టి ఉంటే, బహుశా ఇవాళ ఉదయం మళ్లీ పిచ్‌లోకి అడుగుపెట్టేవాళ్లం కాదు అన్నాడు. కానీ బ్రూక్ చాలా అద్భుతంగా అటాక్ చేశాడని, అతని బ్యాటింగ్‌కు హ్యాట్సాఫ్ చెబుతున్నట్లు సిరాజ్ పేర్కొన్నాడు. ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ 104 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. ఆఖరి రోజు ఇంగ్లండ్ టెయిలెండర్లను తీవ్ర వత్తిడిలోకి నెట్టాడతను. జేమీ స్మిత్, ఓవర్టన్, అట్కిన్సన్ వికెట్లను కూడా తన ఖాతాలో వేసుకుని ఇండియాకు అద్భుత విజయాన్ని సిరాజ్ అందించాడు. బుమ్రా లేని లోటును సిరాజ్ తీర్చాడు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో అతను 86 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసుకున్నాడు.



కంటెంట్ బాగుంటే ఎలాంటి
# పాత్రలైనా చేస్తా

వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు త్రిప్తీ దిమ్రీ. ఇటీవలె ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' సినిమాలో అవకాశం కొట్టేసిన ఆమె, దర్శకుడు విశాల్ భరద్వాజ్ చేసే చిత్రంలోనూ నటిస్తున్నారు. అలాగే, సిద్దార్థ్ చతుర్వేదితో ఆమె నటించిన 'ధడక్ 2' ఆగస్టు 1న ప్రేక్షకులు ముందుకు వస్తోంది. చిత్ర ప్రచారంలో భాగంగా ఆమె మీడియాతో కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ఇందులో నేను కాలేజీ విద్యార్థిగా కనిపిస్తాను. నేనిప్పటివరకూ ఎన్నో కామెడీ, లవ్ చిత్రాల్లో నటించాను. కానీ యాక్షన్ జానర్‌లో రూపొందిన చిత్రాల్లో నటించలేదు. ఒకవేళ అటువంటి సినిమాల్లో అవకాశం వస్తే అస్సలు వదులుకోను. యాక్షన్ పాత్రలు చేయడం ద్వారా నా నటనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించొచ్చని భావిస్తా. కంటెంట్ బాగుంటే నెగెటివ్ పాత్రలు చేయడానికైనా సిద్ధమే" అని పేర్కొన్నారు.

నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



## అది ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట

రైతులకు సాగునీ ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు.. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరన్నారు. ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!. 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేక ఇప్పటికే చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలకు కూడా ఉరివేస్తే.. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరు. రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు, ఇప్పుడు హైదరాబాద్ లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర్ఖత్వానికి పరాకాష్ట.




## తెలంగాణలో 2.5 కోట్ల మందికి..
# ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద డిజిటల్ హెల్త్ కార్డుల జారీలో తెలంగాణ రాష్ట్రం వేగంగా దూసుకుపోతోంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 2.50 కోట్ల మంది ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(అభా) పొందారు. వీరిలో 68 లక్షల మంది తమ హెల్త్ రిపోర్టులను అభాతో అనుసంధానం చేసుకున్నారు. ఒక్క జులై నెలలోనే 2.36 లక్షల మంది తమ రికార్డులను డిజిటల్‌గా లింక్ చేసుకున్నారు.

### ఏంటి ఈ అభా అకౌంట్?

హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. ప్రతి అభా కార్డుకు 14 అంకెల యూనిక్ ఐడీ కేటాయించబడుతుంది. ఈ ఐడీ సహాయంతో ఆరోగ్య సమస్యలు, ల్యాబ్ రిపోర్టులు, మందుల వివరాలు, గతంలో తీసుకున్న చికిత్సలు వంటి అన్ని మెడికల్ రికార్డులను ఒకే చోట నిక్షిప్తం చేయవచ్చు. రోగి ఏ ఆసుపత్రికి వెళ్లినా, డాక్టర్లు ఈ అకౌంట్ ద్వారా వారి హెల్త్ హిస్టరీని త్వరగా తెలుసుకొని సరైన చికిత్స అందించడం సులభమవుతుంది.

### అభా అకౌంట్ ఎలా పొందాలి?

అభా అకౌంట్ పొందడం చాలా సులభం. రెండు మార్గాల ద్వారా దీన్ని పొందవచ్చు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బంది అభా ఐడీని జనరేట్ చేసి ఇస్తారు. దీనికోసం ఆధార్ నంబర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డు అవసరం. రోగులు స్వయంగా కూడా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అధికారిక వెబ్‌సైట్ abdm.gov.in లోకి వెళ్లి కార్డు పొందవచ్చు. ఈ వెబ్‌సైట్‌లో ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను నమోదు చేసి, సులభంగా అభా అకౌంట్ క్రియేట్ చేసుకోవచ్చు.

### అభా కార్డుతో లాభాలు

అభా కార్డు ఉన్న రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు. అభా యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని, ఆసుపత్రిలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా టోకెన్ పొందవచ్చు. ఇంటి నుంచే టోకెన్ జనరేట్ చేసుకునే సౌలభ్యం కూడా ఉంది. పేషెంట్ హెల్త్ హిస్టరీ మొత్తం అకౌంట్‌లో నిక్షిప్తమై ఉండటం వల్ల డాక్టర్లు సమస్యను త్వరగా అర్థం చేసుకొని చికిత్స అందించడం సులభమవుతుంది. ఈ డిజిటల్ హెల్త్ మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఆరోగ్య రికార్డులను ఏకీకృతం చేసి, భవిష్యత్తులో ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్డుల జారీని తప్పనిసరి చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్ కూడా మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేసింది.



## ఎంత పని చేశావు నాగుపాము... రూ.50 లక్షల ఆస్తి నష్టం

నాగుపాము చేసిన ఓ వస్త్ర వ్యాపారికి భారీ ఆస్తి నష్టం జరిగింది. పాము విద్యుత్ స్తంభం ఎక్కి రెండు తీగలను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో వస్త్ర దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం- - - టేకుమట్ల మండల కేంద్రంలో శ్రీనివాస్ అనే వ్యక్తి 15 ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. దుకాణంపైన ఫోర్షన్‌లో తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం రాత్రి దూకాణం మూసి ఇంటికి వెళ్లాడు. దుకాణం పక్కన ఉన్న విద్యుత్ స్తంభంపైకి నాగుపాము ఎక్కింది. నాగుపాము తీగలను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పడానికి ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే దుకాణంలో దుస్తులు, నగదు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. స్తంభం పైనే పాము చనిపోయింది. రూ.50 మేర ఆస్తి నష్టం జరిగినట శ్రీనివాస్ వాపోయాడు. తనని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంట్లో పేలిన సిలిండర్.... రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి మృతి

సిలిండర్ పేలి ఒకరు మృతి చెందిన సంఘటన మేడ్చల్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం- - - మేడ్చల్ పట్టణంలోని మార్కెట్ లో జనం ఇటు అటు తిరుగుతున్నారు. మాజీ ఎంపిటిసి మురళీ ఇంట్లో మొబైల్ షాపుతో పాటు రెండు పూల దుకాణాలు ఉన్నాయి. మురళీ ఇంట్లో ఒక్కసారిగా సిలిండర్ పేలడంతో రోడ్డుపై నడుచుకుంటున్న వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఇళ్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు దినేష్, రఫిక్, తిరుపతమ్మగా గుర్తించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని విద్యార్థిని ఆత్మహత్య

పదవ తరగతిలో టాపర్..ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని విద్యార్థిని ఆత్మహత్య . బాసర ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన అదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని మనిమెల శైలజ(15). కేజీబీవీలో పదవ తరగతి పూర్తి చేసి 563 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన శైలజ. ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని . తనకు ట్రిపుల్ ఐటీలో సీటు రాలేదని, ఎంపీసీలో చేరతానని ఫోన్ చేసి చెప్పిందని ఇంతలోనే ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు.

## పెళ్లి జరిగిన రాత్రే నవ వధువు ఆత్మహత్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లాలో ఉదయం వివాహం చేసుకొని సాయంత్రం నవ వధువు ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం- - - సోమందేపల్లి మండల కేంద్రంలో కృష్ణమూర్తి, వరలక్ష్మిఅనే దంపతులు నివసిస్తున్నారు. ఈ దంపతులకు కూతురు హర్షితా(22) అనే అమ్మాయి ఉంది. కర్నాటకలోని బాగేపల్లి ప్రాంతం దిబ్బూరిపల్లికి చెందిన నాగేంద్రతో హర్షిత వివాహం సోమవారం ఉదయం జరిపించారు. తొలి రాత్రి సోమందేపల్లిలో నిర్వహించేందుకు ఏర్పాట చేశారు. తన గదిలోకి వెళ్లిన వధువు బయటకు రాకపోవడంతో తలుపు తట్టి చూశారు. గదిలో నుంచి ఉలుకు పలుకు లేకపోవడంతో బలవంతంగా డోర్ ఓపెన్ చేశారు. గది పైకప్పుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే నవ వధువును స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని పరీక్షించిన వైద్యులు వెల్లడించారు. ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందో ఇప్పటివరకు వివరాలు తెలియలేదు.



## కొత్త లుక్ లో
# అంజలి అరోరా



కచ్చా బాదం లో రీల్స్ చేయడం ద్వారా దేశవ్యాప్తంగా ఫేమస్ అయిన అంజలి అరోరా, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకుంది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది మరియు ప్రతిరోజూ తన డ్యాన్స్ వీడియోలు మరియు ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది.అంజలి ఇటీవల తన బోల్డ్ ఫోటోషూట్ నుండి కొన్ని చిత్రాలను షేర్ చేసింది. తన కొత్త లుక్ లో, నటి బీచ్ లో కిల్లర్ గా పోజులిచ్చింది.అంజలి ఇటీవల తన బోల్డ్ ఫోటోషూట్ నుండి కొన్ని చిత్రాలను షేర్ చేసింది. తన కొత్త లుక్ లో, నటి బీచ్ లో కిల్లర్ గా పోజులిచ్చింది.అంజలి అరోరా డెనిమ్ షార్ట్స్ మరియు వైట్ టాప్ లో బీచ్ లో కిల్లర్ గా పోజులిచ్చింది. అభిమానులు కూడా ఆమె గ్లామరస్ లుక్ చూసి ఆనందిస్తున్నారు.అంజలి అరోరా ప్రతి లుక్ లో చాలా అందంగా కనిపిస్తుంది. ఆమె తన బోల్డ్ మరియు హాట్ స్టైల్ తో సోషల్ మీడియాను రెచ్చగొడుతుంది.అంజలి అరోరా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఆమె ప్రతిరోజూ ఏదో ఒకటి షేర్ చేస్తూనే ఉంటుంది. అంజలి ఇటీవల ఒక కొత్త వీడియో సాంగ్ లో కనిపించింది. దిల్ పే చలై చురియా దేశవ్యాప్తంగా వైరల్ గా మారింది.



## విడాకులు కన్ఫర్మ్.. పెళ్లి ఫోటోలు డిలీట్ చేసిన హన్సిక

ఇండస్ట్రీలో ఈ ప్రేమలు, పెళ్లిళ్లు ఎవరెవరు ఎప్పుడు చేసుకుంటున్నారు.. అసలు ఎందుకు విడిపోతున్నారు అనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా విడాకులు తీసుకోవడం ఫ్యాషన్ గా మారిపోయింది. 20 ఏళ్లు కలిసి ఉన్న సెలబ్రిటీలు విడాకులు తీసుకొని విడిపోతున్నారు.. ఎన్నో ఆశలతో ప్రేమించి పెళ్లి చేసుకొని మూడేళ్లు కూడా కలిసి లేకుండా విడాకులు తీసుకొని విడిపోతున్నారు. తాజాగా బబ్లీ బ్యూటీ హన్సిక మోత్వానీ సైతం తన భర్తకు విడాకులు ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అందాల భామ హన్సిక బాలనటిగా కెరీర్ ను మొదలుపెట్టి.. తెలుగులో దేశముదురు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి కుర్ర హీరోల సరసన నటించి మెప్పించింది. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే హన్సిక.. తన ఫ్రెండ్ భర్త అయిన సోహైల్ కతూరియాను వివాహమాడింది. 2022 లో వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. అంతేకాకుండా వీరి పెళ్లి డాక్యుమెంటరీ హన్సికస్ లవ్ షాదీ డ్రామా పేరుతో జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కూడా అయ్యింది. ఆ డాక్యుమెంటరీలో హన్సిక.. సోహైల్ తో తన ప్రేమ.. పెళ్లి అయ్యినవాడిని ప్రేమించినందుకు తనను ఇంట్లో ఎంతలా అవమానించాచారో అన్ని చెప్పుకొచ్చింది.